క్లుప్తంగా

మధ్యవర్తిత్వంపై అవగాహన కలిగి ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి

గిద్దలూరు రూరల్: న్యాయవాదులు మధ్యవర్తిత్వంపై అవగాహన కలిగి ఉండాలని గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీ సారాదానమ్మ అన్నారు. స్థానిక కోర్టు భవనం ఆవరణలో మంగళవారం న్యాయవాదులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో ఉన్న సమస్యలతో పాటు కేసులను పరిష్కరించుకోవడానికి మధ్యవర్తిత్వం ఎంతో దోహదపడుతుందన్నారు. కక్షిదారులు వారి కేసులను సున్నితంగా పరిష్కరించుకోవడానికి ఇది మార్గమని తెలిపారు. న్యాయవాదులు శేషశయనారెడ్డి, వెంకటేశ్వరరావు, హిమశేఖరరెడ్డి, మల్లిఖార్జున, రవి ప్రకాష్ పాల్గొన్నారు.

మాజీ సైనికుల సేవలు ప్రశంసనీయం


మాజీ సైనికులను అభినందిస్తున్న సీఐ, ఎస్సై

కంభం: ఎన్నికల విధుల్లో మెరుగైన సేవలందించిన మాజీ సైనికులను కంభం సీఐ జె. రామకోటయ్య, ఎస్సై పులి రాజేష్ అభినందించారు. మంగళవారం సాయంత్రం మాజీ సైనికులు కంభం పోలీస్‌స్టేషన్‌లో అధికారులను కలిశారు. మాజీ సైనికులు ఎన్నికల విధుల్లో పాల్గొని బాధ్యతగా వారి కర్తవ్యాన్ని నిర్వర్తించారని సీఐ తెలిపారు. సోమవారం జరిగిన ఎన్నికల బందోబస్తులో కంభం మండలానికి చెందిన 73 మాజీ సైనికులు ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. సంకతాల ప్రసాద్, పోలయ్య, సుబేదార్ మహబూబ్ బాష, స్వామికుమార్ ఉన్నారు.

గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలి


పెద్ద ఓబినేనిపల్లెలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై నరసింహారావు

బేస్తవారిపేట: ఎన్నికలు ముగిశాయని, ఎటువంటి గొడవలు పెట్టుకోవద్దని ఎస్సై నరసింహారావు అన్నారు. మంగళవారం మండలంలోని పూసలపాడు, పెద్ద ఓబినేనిపల్లెలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో చిన్నపాటి గొడవలను పెద్దవిగా చేసుకుని భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో అంతా కలిసిమెలిసి ఉండాలని, రెచ్చగొట్టే ప్రకటనలు చేయవద్దని కోరారు. ఎన్నికలు ముగిశాయని, వాటిపై చర్చలు జరిపి వాగ్వాదం చేసుకోవద్దని సూచించారు.

మెజార్టీపై వైఎస్సార్ సీపీ ధీమా

- మార్కాపురంలో 2019 ఎన్నికల కంటే పెరిగిన పోలింగ్ శాతం
- 2019లో 85.09 శాతం, ప్రస్తుత ఎన్నికల్లో 87.58 శాతం నమోదు
- సంక్షేమ పాలనకే మహిళలు, వృద్ధుల మద్దతు



బచ్చలకూరపాడులో పోలింగ్‌కు వచ్చిన మహిళలు

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో గత ఎన్నికల కంటే అదనంగా పోలింగ్ శాతం నమోదైంది. 2019 ఎన్నికల్లో 85.09 శాతం నమోదవగా ప్రస్తుతం 87.58 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసారి రాత్రి పది గంటల వరకు ఓటర్లు తమ ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద వేచి ఉన్నారు. 2019 ఎన్నికల్లో నియోజకవర్గంలో 2,09,756 మంది ఓటర్లు ఉండగా, ఆ ఎన్నికలలో 1,78,474 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య పెరిగింది. మొత్తం 2,14,608 మంది ఓటర్లలో 1,87,952 మంది ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో 9,478 మంది నూతన ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

సంక్షేమ పాలనకే మొగ్గు

నియోజకవర్గంలోని మార్కాపురం టౌన్, మండలం, పొదిలి, కొనకమిట్ల, పొదిలి మండలాల్లో 257 కేంద్రాల్లో పోలింగ్ సరళిని పరిశీలిస్తే మెజార్టీ ఓటర్లు వైఎస్సార్ సీపీ వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ప్రధానంగా సంక్షేమ పథకాలు ప్రజల సామాజిక, ఆర్థిక, జీవన స్థితిగతులను మార్చాయి. ఓటింగ్‌లో మహిళా ఓటర్లు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గత ఎన్నికల్లో 88,519 మహిళలు ఓటు వినియోగించుకోగా ఈ ఎన్నికలలో 92,750 మంది తమ ఓటు వేశారు. అంటే గత ఎన్నికల కంటే ఈ ఎన్నికలలో 4,231 మంది మహిళలు పోలింగ్‌లో పాల్గొన్నారు.

నియోజకవర్గంలో మొట్టమొదటి పోలింగ్ బూతు మార్కాపురం మండలం జమ్మనపల్లి గ్రామంలో 91.80 శాతం పోలింగ్ నమోదైంది. 862 మంది ఓటర్లు ఓటు వేశారు. ఈ గ్రామంలో మహిళ ఓటర్లే 444 మంది తమ ఓటు వేసుకోగా, 418 మంది పురుషులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టణంలోని 78వ పోలింగ్ బూత్‌లో నూరు శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో 981 మంది ఓటర్లకు గాను మహిళలు 465 మంది తమ ఓటు వేశారు. ప్రధానంగా వైఎస్సార్ ఆసరా, చేయూత, జగనన్న ఇళ్లు, అమ్మ ఒడి తదితర పథకాలు మహిళల పేరుపైనే అమలవుతున్నాయి. తర్లుపాడు మండలంలోని రాగసముద్రంలో 95.96 శాతం పోలింగ్ నమోదైంది. కొనకనమిట్ల మండలంలోని గరిమినపెంటలో 96.86 శాతం నమోదు కాగా, ఇక్కడ మహిళ ఓటర్లు పురుషుల కంటే ఎక్కువగా ఉన్నారు. మొత్తం 329 మంది మహిళ ఓటర్లు ఓటు వేయగా, 318 మంది పురుష ఓటర్లు ఉన్నారు. పొదిలి మండలంలోని అక్కచెరువులో 96.84 శాతం నమోదైంది. మూగచింతల, నందిపాలెం, పొదిలిలో కూడా పోలింగ్ శాతం ఎక్కువగా నమోదైంది. సంక్షేమ పథకాల కొనసాగింపునకే మహిళలు, వృద్ధులు ఆమోదం తెలిపారని వైఎస్సార్ సీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మార్కాపురం నియోజకవర్గంలో
87.58 శాతం పోలింగ్

- ఒంగోలులోని స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలు తరలింపు
- భద్రతా చర్యలను పర్యవేక్షించిన సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

మార్కాపురం: ఈనెల 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం నియోజకవర్గంలో 87.58 శాతం పోలింగ్ నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ రాహుల్ మీనా వెల్లడించారు. నియోజకవర్గంలో మొత్తం 2,14,608 మంది ఓటర్లు ఉండగా సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో 1,87,952 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 95,195 మంది పురుషులు, 92,750 మంది మహిళలు ఉన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో సోమవారం రాత్రి 10 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. అనంతరం ఈవీఎంలను పోలింగ్ అధికారులు పోలీసు భద్రత మధ్య మార్కాపురంలోని ఎస్వీకేపీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అధికారులకు అందించారు. ఈ సెంటర్‌కు మార్కాపురంతోపాటు యర్రగొండపాలెం నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలు కూడా తీసుకొచ్చారు. తెల్లవారుజామున 4 గంటల వరకు రెవెన్యూ, పోలీస్, ఎన్నికల సిబ్బంది విధుల్లో ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయుధ పోలీసు భద్రత మధ్య ఈవీఎంలను ప్రత్యేక వాహనాల్లో ఒంగోలు తరలించారు.


ఈవీఎంలను వాహనంలోకి ఎకిస్తున్న సిబ్బంది

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం

ముండ్లమూరు: జిల్లాలో దర్శి నియోజకవర్గంలో అత్యధికంగా 91 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో 90.35 శాతం నమోదైంది. అప్పట్లో వైఎస్సార్ సీపీకి దర్శి నియోజకవర్గానికి అనూహ్యంగా 39 వేల మెజార్టీని ప్రజలు కట్టబెట్టారు. ఇప్పుడు జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని ఓటు వేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన వారు మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎంని చేసుకునేందుకు ప్రజలు సిద్ధమైనట్లు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. మండలంలో గత ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా తీర్పు ఇచ్చారు. మరోసారి ప్రజలు సోమవారం జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మెజార్టీని కట్టబెట్టేందుకు సిద్ధమైనట్లు పోలింగ్ సరళిని బట్టి అర్థమవుతోంది. మండలంలోని మారెళ్ల, ఉమామహేశ్వరపురం, పూరిమెట్ల, ఈదర, వేముల, పెద ఉల్లగల్లు, పులిపాడు, పసుపుగల్లు, నాయుడుపాలెం, పోలవరం, కొమ్మవరం గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి రెండు వేలకుపైగా మెజార్టీ వస్తుందని ఆ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు. తాళ్లూరు మండలంలోని దారంవారిపాలెం, తూర్పుగంగవరం, బొద్దికూరపాడు, తాళ్లూరు, శివరామపురం, మాధవరం, వెలుగువారిపాలెం, లక్కవరం, నాబంబొట్లపాలెం గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి సుమారు ఏడు వేల నుంచి ఎనిమిది వేల వరకు మెజార్టీ వస్తుందని వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు.


ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు

సంక్షేమానికి జై కొట్టిన ఓటరు

- గిద్దలూరు నియోజకవర్గంలో భారీగా పెరిగిన పోలింగ్ శాతం
- 2019లో 81.72 శాతం, 2024లో 84.74 పోలింగ్ శాతం నమోదు
- నియోజకవర్గంలో ఓటేసిన మహిళలు 102809, పురుషులు 100318
- పోలింగ్ శాతం పెరగడంపై వైఎస్సార్ సీపీలో జోష్

బేస్తవారిపేట: సార్వత్రిక ఎన్నికల్లో భారీగా పోలింగ్ జరగడంపై రాజకీయ పార్టీలు జోష్ మీద ఉన్నాయి. గిద్దలూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,39,710 మంది ఉన్నారు. ఓటేసిన మహిళలు 102809, పురుషులు 100318, ఇతరులు 9 మంది ఉన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేయడంతో 2024 ఎన్నికల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. 2019లో 81.72 శాతం నమోదుకాగ 2024లో 84.74 నమోదైంది. సంక్షేమ పథకాలను అందుకున్న మహిళలు ప్రతి పోలింగ్ బూత్‌లో బారులు తీరారు. మహిళల, గిద్దలూరు నగర పంచాయతీలో 77 శాతం ఉంటే, గ్రామీణ ప్రాంతాల్లో 87 శాతం ఓటింగ్ నమోదుపై వైఎస్సార్ సీపీలో మంచి జోష్ కనబడుతోంది.

బేస్తవారిపేట మండలం: బేస్తవారిపేట మండలం వైఎస్సార్ సీపీకి కంచుకోట. ఒకటి, రెండు పంచాయతీల్లో తప్ప ఎప్పుడు వైఎస్సార్‌సీపీకే మెజార్టీ వస్తుంది. పూసలపాడు, గలిజేరుగుళ్ల, జేసీ అగ్రహారం, బసినేపల్లె పంచాయతీల్లో అత్యధికంగా ఓట్లు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఈ పంచాయతీల్లో భారీ మెజార్టీ వచ్చింది. సంక్షేమ పథకాలను అందుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలు అధికంగా ఉన్న బూత్‌లలో వైఎస్సార్ సీపీకి మెజార్టీ అందించేలా ఎన్నికల సరళిని బట్టి అంచనా ఉంది. బేస్తవారిపేట మేజర్ పంచాయతీలో ఎస్సీలు, ముస్లీం మైనార్టీలు ఎక్కువగా ఉన్న 85, 87, 88, 89 బూత్‌లలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా మారింది.

అర్ధవీడు మండలంలో..

మండంలో 28,386 ఓటర్లున్నారు. పురుషులు 12541, మహిళలు 12506 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని అర్ధవీడు, పాపినేనిపల్లె పంచాయతీల్లో ఎస్సీలు, ముస్లీం మైనార్టీలు, రెడ్డి కమ్యూనిటీ ఎక్కువగా ఉన్నారు. గతంలో వచ్చినట్లే 2024లో భారీ మెజార్టీ వస్తుంది. మొహిద్దీన్‌పురం, బోగోలు, నాగులవరం, యాచవరం, అయ్యవారిపల్లె వంటి పంచాయతీల్లో మంచి మెజార్టీ వచ్చే అవకాశం ఉంది.

కంభం మండలంలో..

ఇక్కడ 83.52 శాతం పోలింగ్ నమోదు జరిగింది. మండలంలో మొత్తం ఓటర్లు 38152 ఉన్నారు. వీరిలో పురుషులు 15634, మహిళలు 16228 ఓటు వేశారు. కంభం మేజర్ పంచాయతీలో ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉన్నారు. కంభం పంచాయతీలో 14 బూత్‌లు ఉండగా ముస్లిం ఓటర్లు, ఎస్సీ ఓట్లు అధికంగా ఉండటంతో ఈ బూత్‌లలో వైఎస్సార్ సీపీకి ఎక్కువ మొత్తంలో మెజారిటీ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. కంభం మండలం టీడీపీకి గతంలో అనుకూలంగా ఉన్నప్పటికీ 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా మారింది.

రాచర్ల మండలంలో..

మండలంలో 28609 ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 11990, మహిళలు 12580 ఓటు వేశారు. ఈ మండలం వైఎస్సార్ సీపీకి కంచుకోట. రాచర్ల మండలంలోని యడవల్లి, అనుమలవీడు, ఆకవీడు, అచ్చంపేట, రాచర్ల, గుడిమెట్ట, సంగపేట, జేపీ చెరువు, పాలకవీడు, గౌతవరం గ్రామాల్లో ముస్లీం ఓటర్లు ఎక్కువ శాతం ఉన్నారు. తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తే ముస్లిం రిజర్వేషన్ తొలగిస్తారని చెప్పడంతో చాలా మంది ముస్లింలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యధికంగా ఓట్లు వేశారు. గౌతవరం, అనుములపల్లె గ్రామాల్లో అత్యధికంగా బలిజ ఓట్లున్నాయి. ఈ రెండు గ్రామాల్లో ప్రస్తుతం ఎలక్షన్‌కి టీడీపీకి కొంతమేరకు మెజారిటీ వచ్చే అవకాశాలున్నాయి. రామాపురం, సోమిదేవిపల్లె గ్రామాల్లో రెడ్లు ఓట్లు అత్యధికంగా ఉన్నాయి. ఈ రెండు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజారిటీ వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది.

కొమరోలు మండలం...

కొమరోలు మండలంలో 33317 ఓటర్లు ఉన్నారు. పురుషులు 13610, మహిళలు 14136 ఓటర్లు ఓటు వేశారు. కొమరోలు మండలం వైఎస్సార్ సీపీకి కంచుకోట. ఇక్కడ ఉన్న ఇరు వర్గాలు ఒకే తాటిపై నిలవడంతో వైఎస్సార్ సీపీకి మెజార్టీ వచ్చే అవకాశం మెండుగా ఉంది.

గిద్దలూరులో..

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నగర పంచాయతీలో మొత్తం 20 వార్డులకు గాను 31 పోలింగ్ కేంద్రాలున్నాయి. అందులో పురుషులు 14950, స్త్రీలు 15445, ఇతరులు నలుగురు, మొత్తం 30399 ఓటర్లు ఉండగా పురుషులు 11397, స్త్రీలు 12093 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. 3491 ఓట్లు పోలింగ్ అయ్యాయి. 17వ వార్డులో ఎక్కువగా ముస్లిం ఓట్లు, యాదవులు, జంగాలి కులాల వారు అధికంగా ఉంటారు. గిద్దలూరు మండలం రూరల్ 19 గ్రామ పంచాయతీలకు గాను 48 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అందులో పురుషులు 19890, స్త్రీలు 19715 ఓట్లు మొత్తం 39611 ఓట్లు ఉండగా 34488 ఓట్లు పోలింగ్ అయ్యాయి. 87.07 ఓట్లు పోలింగ్ శాతం అయ్యింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఆర్యవైశ్యులు, రెడ్డి సమాజిక వర్గాలు వైఎస్సార్ సీపీకి అండగా నిలిచారు. దీంతో గిద్దలూరు నగర పంచాయతీ, రూరల్ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీకి మెజార్టీ వచ్చే పరిస్థితి ఏర్పడింది.

తర్లుపాడులో ప్రశాంతంగా ఎన్నికలు

తర్లుపాడు: మండలంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 35 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ నిర్వహించారు. ఓటర్లు మండుటెండలో నిల్చుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతం ఉదయం 11 గంటలకు 25 శాతం కాగా మధ్యాహ్నం ఒంటి గంటకు 45 శాతం, 3 గంటలకు 60, 5 గంటలకు 80 శాతం పైగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. సీతానాగులవరంలో అధిక ఓట్లు ఉండటంతో 9 గంటలకు ఓటింగ్ జరిగింది. మండలంలో మొత్తం 26,242 మంది ఓటర్లు ఉండగా 23,861 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 12,290 మంది కాగా మహిళలు 11,571 మంది ఉన్నారు. పలు చోట్ల టీడీపీ ఏజెంట్లు, సానుభూతిపరులు కవ్వింపు చర్యలకు పాల్పడినప్పటికీ వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయమనం పాటించారు. కౌంటింగ్ ముగిసే వరకు ఎన్నికల నిబంధనలు అమల్లో ఉంటాయని ఎస్సై సుధాకర్ తెలిపారు.